జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 12-11-2024 శ్రీకాకుళం సంపుటి: 2 సంచిక: 161 పేజీలు: 8 వెల : రూ.7



# ఆగని పీడీఎస్ బియ్యం దందా

**కొత్తూరు, నవంబర్ 11 (వార్త):** పేదల కడుపు నింపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా అందించే రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. కార్డుదారునికి ఐదు కేజీల చొప్పున బియ్యం అందిస్తోంది. జిల్లాలో ఆర్థికంగా ఎంతో మంచి స్థితిలో ఉన్న వారికి తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. కోట్లలో విలువైన స్థిరాస్తులు కలిగిన వారు కూడా ఉచితంగా రేషన్ బియ్యం పొందుతున్నారు. ఉచిత బియ్యం తీసుకున్న వారిలో 70 శాతం మంది ఈ బియ్యాన్ని తినడం లేదు. వాటిని షాపులకు, మిల్లులకు తరలింపోతోంది. ఉచిత బియ్యం ఒక కిలో రూ.20లు చొప్పున విక్రయించేస్తున్నారు. దీంతో పేదల కడుపు నింపాలన్న ప్రభుత్వ ఉద్దేశం నెరవేరడం లేదు. సివిల్ సప్లై శాఖలో ఎన్ని సంస్కరణలు చేసినా పీడీఎస్ బియ్యం సరఫరాలో అక్రమాలు ఆగడం లేదు. దళారులు నేరుగా లబ్ధిదారుల ఇంటింటికీ తిరిగి ఈ బియ్యం సేకరిస్తున్నారు. కొందరు రైస్ మిల్లర్లు ఏజెంట్లను పెట్టుకుని నేరుగా లబ్ధిదారుల ఇళ్ల నుంచి ఈ బియ్యం తెప్పించుకుంటున్నారు. ఇలా ప్రతినెలా పెద్ద ఎత్తున బియ్యం మిల్లులకు తరలిపోతోంది.

రైస్‌మిల్లుల్లో ఈ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి, పాలిసింగ్ చేసి, సన్నగా మార్చుతున్నారు. మంచి ప్యాకింగ్ చేసి బియ్యం విక్రయించే షాపులకు చేరవేస్తున్నారు. రవాణాలో ఎక్కడా ఇబ్బంది రాకుండా కొందరు రెవెన్యూ, పోలీసు సిబ్బందితో ఒప్పందం కుదుర్చుకుని నిరాటంకంగా అక్రమ దందా నడుపుతున్నారు. పీడీఎస్ అక్రమ దందాకు అలవాటుపడ్డ రైస్ మిల్లులపై ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు దాడులు చేసిన దాఖలాలు లేవు.

### ఆంధ్రా టు ఒడిశాకు..

కొత్తూరు మండలం నుంచి పీడీఎస్ బియ్యం ఒడిశాలోని రైస్ మిల్లులకు తరలిపోతోంది. ప్రభుత్వం ఉచితంగా పేదప్రజలకు ఇస్తున్న బియ్యాన్ని కొందరు వ్యాపారులు ఆంధ్రా సరిహద్దు గ్రామాల్లో కిలో రూ.20లకు కొనుగోలు చేసి పక్కనున్న ఒడిశాలోని మిల్లర్లకు రూ.26లకు విక్రయిస్తున్నారు. ఒక్క కొత్తూరు మండలంలోనే ప్రతినెలా కనీసం 400 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఆంధ్రా నుంచి ఒడిశాకు వెళ్లిపోతోంది.



* ఆంధ్రా నుంచి ఒడిశాకు తరలింపు
* ఏజెంట్లు ద్వారా లబ్ధిదారుల నుంచి పీడీఎస్ బియ్యం సేకరణ
* నేరుగా షాపులు, రైస్ మిల్లులకు
* రీసైక్లింగ్ చేసి సన్నాలుగా మార్చి తిరిగి అమ్మకాలు
* దాడులు చేయడంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విఫలం

# ఫ్లెక్సీలు నిషేధం

* నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు
* నగర పాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు



**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 11(వార్త):** శ్రీకాకుళం నగరంలోని రోడ్ల వధ్యలో మీడియన్స్, ముఖ్యమైన జంక్షన్లలో ఫ్లెక్సీలు, ప్రకటన బ్యానర్లు ఏర్పాటు చేయడం నిషేధించామని నగర పాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు తెలిపారు. రాష్ట్ర టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. రోడ్ల మధ్యలో మీడియన్స్, ముఖ్యమైన జంక్షన్లలో ప్రకటన బ్యానర్లు,ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకి ఇబ్బంది కలుగుతున్న దృష్ట్యా రాష్ట్ర మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు అటువంటి వాటిని ఏర్పాటు చేయడాన్ని నిషేధించినట్లుగా వివరించారు. ఇకపై ఎవరైనా ప్రభుత్వ ఆదేశాలకి విరుద్ధంగా రోడ్ల మధ్యలో ఫ్లెక్సీలు, ప్రకటన బ్యానర్లు ఏర్పాటు చేస్తే శిక్షార్హులవుతారన్నారు. శ్రీకాకుళం నగర ప్రజలు ఈ ఆదేశాలను పాటించాలని నగర పాలక సంస్థ కమిషనర్ కోరారు.



# కదలరు.. వదలరు!

* జిల్లా పోలీసు కార్యాలయంలో తిష్ట వేసిన కొందరు సిబ్బంది
* పలు విభాగాల్లో అదనపు సిబ్బంది
* ఒకరి పనికి.. ఇద్దరేసి మంది
* పోలీస్ స్టేషన్లలో మాత్రం సిబ్బంది కొరత
* బాస్ దృష్టికి తీసుకువెళ్లని ఆయా విభాగాల అధికారులు
* జిల్లా పోలీస్‌బాస్ దృష్టి సారించాలని పలువురు వినతి

**శ్రీకాకుళం క్రైం, నవంబర్ 10(వార్త):** జిల్లా పోలీస్ కార్యాలయంలోని పలు విభాగాల్లో సిబ్బంది అదనంగా ఉన్నారు. దీంతో అక్కడ పనిలేక కొందరు ఖాళీగా ఉంటున్నారు. ఒకరి పనికి ఇద్దరేసి మంది చేస్తూ పబ్బం గడుపుతున్నారు. ఏహెచ్‌టీయూ, అవుట్‌వార్డు, ఇన్‌వార్డు, తదితర విభాగాల్లో హోంగార్డులు చేయాల్సిన పనులను హెడ్‌కానిస్టేబుళ్లు చేస్తున్నారు. డీసీఆర్‌బీలో వచ్చిన కాగితాన్ని తీసుకొని సంబంధిత విభాగానికి ఇవ్వడానికి కూడా ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, ఒక హోంగార్డును కేటాయించారు. సీఎంఎస్ విభాగంలోనూ ఇదే పరిస్థితి. మిగతా విభాగాల్లోనూ ఇలానే ఉంటోంది. గత ఎస్పీ హయాంలో పలువురు కానిస్టేబుళ్ల, హెడ్‌కానిస్టేబుళ్ల, ఏఎస్‌ఐలకు బదిలీ అయింది. వారు పలువురు పోలీసు అధికారులు, రాజకీయ నేతల వద్ద ప్రదక్షిణలు చేసి బదిలీ కాకుండా జిల్లా పోలీసు కార్యాలయంలో ఉద్యోగం వేయించుకున్నారు. ఇక్కడైనా ఉద్యోగం హాయ్‌గా.. జాయ్‌గా ఉంటుందన్న నెపంతో ఇతర పోలీస్‌స్టేషన్లకు బదిలీ కాకుండా మేనేజ్ చేసుకుంటున్నారు. అవసరానికిమించి సిబ్బంది జిల్లా పోలీసు కార్యాలయంలో ఉన్నారని అక్కడ ఉన్న కొందరు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో సిబ్బంది కొరత అధికంగా ఉంది. సిబ్బంది తక్కువ.. పనిభారం ఎక్కువ కావడంతో పలువురు ఒత్తిడికి గురవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా పోలీస్‌బాస్ స్పందించి జిల్లా పోలీసు కార్యాలయంలోని ఏయే విభాగాల్లో ఎంతెంత మంది ఉన్నారన్న దానిపై దృష్టి సారించాల్సివుంది.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## సాగునీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల



**జలుమూరు, నవంబర్ 11(వార్త):** సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తహసీల్దార్ టి.సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నరసన్నపేట మండలంలో ఆరు డిసీలు, 12 టీసీలు ఉన్నాయన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి పంచాయతీలో నోటిఫికేషన్ పత్రాలను ఆయా సచివాలయ కేంద్రాల వద్ద నోటీసు బోర్డులో పెట్టినట్లు తెలిపారు. సుమారు 18 వేలకుపైగా ఓటర్లు ఉన్నారని స్పష్టం చేశారు.

# ఆఫ్‌షోర్‌కు బడ్జెట్ కేటాయింపు

**-సీఎం, మంత్రులకు కృతజ్ఞతలు**

**తెలిపిన ఎమ్మెల్యే గౌతు శిరీష**



**కాశీబుగ్గ, నవంబర్ 11(వార్త):** ఆఫ్ షోర్ రిజర్వాయర్ నిర్మాణానికి మళ్లీ వడివడిగా అడుగులు పడుతున్నాయని, ఇందుకు ప్రభుత్వం తొలివిడతగా రూ. 35 కోట్లు మంజూరు చేసిందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. తమ ప్రభుత్వం ఎల్ల వేళలా రైతుల శ్రేయస్సును కోరుకుంటోందన్నారు. ఆఫ్‌షోర్‌కు కోట్లాది నిధులను అప్పటి టీడీపీ ప్రభుత్వం కేటాయించినట్లు గుర్తు చేశారు. ఆఫ్ షోర్ పూర్తి చేస్తామని ఏడాదికి రెండుసార్లు ప్రకటనలు వైసీపీ వారు ఇచ్చారే తప్ప తట్టెడు మట్టి వేయలేదని ఆక్షేపించారు. కానీ చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఆ ప్రాజెక్ట్‌కు మళ్లీ జీవం పోశారని కొనియాడారు. నిధులు మంజూరు చేసిన రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## జాబ్‌మేళాలో 60మందికి ఉద్యోగాలు




**జలుమూరు, నవంబర్ 11(వార్త):** నిరుద్యోగ యువత జిల్లా నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగే జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.లత అన్నారు. సోమవారం నరసన్నపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళాను ఏర్పాటు చేశారు. మూడు సంస్థల వారు ఇంటర్వ్యూలు నిర్వ హించి, 60 మందిని ఎంపిక చేశారు.

# అబుల్ కలాం ఆజాద్‌కు ఘన నివాళులు







**జలుమూరు, నవంబర్ 11(వార్త):** భారతదేశ తొలి విద్యా శాఖా మంత్రి మౌలానాఅబుల్‌కలాంఆజాద్ జయంతి వేడుకలను సోమవారం నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ప్రిన్సిపల్ పి.లత పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురం:** ఇచ్ఛాపురంలోని శాంతి నికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో జాతీయ విద్యా దినోత్సవం సోమవారం నిర్వహించారు. స్కూల్ చైర్మన్ డి.కృష్ణ మూర్తిరెడ్డి.. మౌలానా అబుల్‌కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ కేసీ పూరి, ఉపాధ్యా యులు సురేఖ పట్నాయక్, పద్మజ, శ్రీధర్, శాంతి ఇంటరాక్ట్ క్లబ్ ప్రెసి డెంట్ పి.తేజస్, సెక్రటరీ మోహన్ ప్రియ, వైస్ ప్రెసిడెంట్ జి.హారిక, జాయింట్ సెక్రటరీ డి.హర్షవర్ధన్ రెడ్డి, ఎస్‌పీఎల్ జోత్స్న పాల్గొన్నారు.

**జలుమూరు:** చల్లవానిపేట జంక్షన్ సమీపంలో గల ఎంఎస్ఎన్ హైస్కూల్ లో సోమవారం మౌలాన్ అబుల్ కలాం ఆజాద్ జయంతి ఘనంగా జరిపారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు మామిడి సత్యనారాయణ పాల్గొని అబ్దుల్ కలాం ఆశయాలను వివరించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హైస్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నేడు పితాతొళిలో ఏక హెూమోత్సవం



**మందస, నవంబరు 11(వార్త):** పితాతొళిలో మంగళవారం ఏక హెూమోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 24 గంటల పాటు రామకృష్ణ నామ పారాయణం, మహా అన్నప్రసాద వితరణ ఉంటుందని సర్పంచ్ ప్రతినిధి చింతాడ గణపతి, శ్రీరాధాకృష్ణ, ఆంజనేయ గ్రామాభివృద్ధి సంఘం నాయకులు తెలిపారు. భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

## బీమాను సద్వినియోగం చేసుకోండి



**జలుమూరు, నవంబర్ 11(వార్త):** జీడి పంటల బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన విస్తరణ అధికారి బగ్గు ఆమని సూచించారు. సోమవారం ఆమె నరసన్నపేట మండలం మడపాం గ్రామంలో రైతులకు బీమా పథకంపై అవగాహన కల్పించారు. జీడి పంటలకు ఎకరాకు రూ.1,600, హెక్టారుకు రూ.4 వేలు ప్రీమియం చెల్లించాలని, ఈ నెల 15తో గడువు ముగియనుందన్నారు. రైతులు మీ సేవలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

# భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు





**జలుమూరు, నవంబర్ 11(వార్త):** నరసన్నపేట మండలం నర్సింగపల్లిలో సోమవారం నిర్వహించిన గ్రామసభలో 16 వినతులు రైతుల వద్ద నుంచి స్వీకరించినట్లు తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు.

రీ సర్వేలో తలెత్తిన సమస్య లను పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జి.కృష్ణ, సర్వేయర్ అప్పలస్వామి పాల్గొన్నారు.

**జలుమూరు:** రైతుల భూ సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జె.రామారావు తెలిపారు. సోమవారం ఆయన బొడ్డపాడులో గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో సమస్యలకు పరిష్కారం చూపుతామని, రైతులు అర్జీలు సమర్పించాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థినులకు వైద్య పరీక్షలు



**జలుమూరు, నవంబర్ 11(వార్త):** నరసన్నపేట మండలం తామరాపల్లిలోని అంబేద్కర్ గురుకుల జూనియర్ కళాశాలలో సోమవారం మాకివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో ఉప్పాడ శాంతారావు మాట్లాడుతూ విద్యార్థులకు ఆరోగ్య పరంగా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. 150 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేశారు.

## ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల తనిఖీ

**జలుమూరు, నవంబర్ 11(వార్త):** నరసన్నపేట మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ విజయకుమారి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో అపార్ నమోదుపై ఆరా తీశారు. వీలైనంత తొందరగా రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలు పరిశుభ్రంగా ఉంచాలని విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన చేయాలని సూచించారు. ఎంఈవోలు పాల్గొన్నారు.



# రాయితీపై స్ప్రింక్లర్ పైపుల పంపిణీ



**మెళియాపుట్టి, నవంబర్ 11(వార్త):** రాయితీపై 18మంది రైతులకు స్ప్రింక్లర్ పైపులను పంపిణీ చేసినట్లు ఉద్యాన శాఖ సిబ్బంది శరత్‌కుమార్ రెడ్డి తెలిపారు. కేరాసింగి, మగ్రిపాడు రైతుసేవా కేంద్రాల పరిధిలో 55శాతం రాయితీపై స్ప్రింక్లర్లు పైపులు ఇస్తున్నామన్నారు.

రైతులు స్ప్రింట్లు, డ్రిప్ పైపులు కావాలనుకుంటే మీ రైతుసేవ కేంద్రంలో సంప్రదించాలన్నారు. జీడి తోటలకు బీమా పథకం ఈ రబీ నుంచి ప్రభుత్వం ప్రారంభించిందని, రైతు ఎకరాకి రూ.1600 చొప్పున బీమా చెల్లిస్తే రూ.32000వరకు, హెక్టార్‌కు రూ.4000 చొప్పున ప్రీమియం చెల్లించిన రైతులకు రూ.80,000వరకు బీమా వచ్చే అవకాశం ఉందన్నారు. ఇది పూర్తిగా వాతావరణ ఆధారంగా దీనిపై అన్ని రైతుసేవా కేంద్రాల పరిధిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నామని, ఈనెల 15 చివరి తేదీ అని తెలిపారు.

ఆయన వెంట సిబ్బంది షణ్ముఖ రావు, రైతులు తదితరులు ఉన్నారు.

## గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు: ఎక్సైజ్ సీఐ బేబి



**మందస, నవంబరు 11(వార్త):** గ్రామాల్లో మద్యం బెల్టు దుకాణాలను నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సీఐ కె.బేబి హెచ్చరించారు. మందసలో ఆమె మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణకు వేలంపాటలు నిర్వహిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. అది చట్టరీత్యా నేరమన్నారు. సోంపేట ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలో 10రోజులుగా ఐదు బెల్ట్ షాపుల కేసులు, ఒక ఐడీ కేసు నమోదు చేశామన్నారు. రెండు బెల్లం ఊటలను ధ్వంసం చేశామన్నారు. ఆరుగురిని అరెస్ట్ చేసి, నలుగురిని ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ సమక్షంలో బైండోవర్ చేశామన్నారు. మందస మండలంలోని సారా తయారీ కేంద్రాలపై దాడి చేస్తామన్నారు. సారా తయారీ, బెల్టుషాపుల నిర్వహణపై తమకు సమాచారం అందివ్వాలని కోరారు.




## సొండిపూడి విద్యార్థి హర్ష ప్రతిభ

**మందస, నవంబరు 11(వార్త):** 'జాతీయ సంపద సృష్టిలో దేశ సమగ్రత పాత్ర' అనే అంశంపై సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం రామకృష్ణాపురం వద్ద గల పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ సంస్థ వ్యాసరచన పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో మట్ట హర్ష ప్రథమ బహుమతి, జె.నిహారిక ద్వితీయ బహుమతి, పి. పావని తృతీయ బహుమతి, వై.మధుప్రియ కన్సొలేషన్ బహుమతులను గెలుచుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుందర్‌సాల్మన్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ప్రతినిధులు కోన శేఖర్, మేనేజర్ కె.రఘుపతిరావు, జూనియర్ ఇంజనీర్ ఇ.అప్పలనాయుడు, టెక్నీషియన్లు పాల్గొన్నారు.

## సంగాంలో మహా అన్న సమారాధన



**వంగర, నవంబర్ 11(వార్త):** సంగాంలో వెలసిన సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం మహా అన్న వితరణ జరిపారు. రుషింగి గ్రామానికి చెందిన సురేష్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ వైద్యుడు యలకల సురేష్, లోటస్ డయాగ్నస్టిక్ వారి సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఆర్ఎంపీ ఊగిరి ముత్యాలరావు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## జగన్‌ని కలిసిన మామయ్య రెడ్డి



**ఇచ్ఛాపురం, నవంబర్ 11(వార్త):** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను వైస్సార్సీపీ మండల నాయకులు పిట్ట మామయ్య రెడ్డి సోమవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆయనను జగన్‌కు పరిచయం చేశారు.

## పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక సమావేశం



**జలుమూరు, నవంబర్ 11(వార్త):** గ్రామ పంచాయతీల పరిధిలో అభివృద్ధి ప్రణాళికపై మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో జలుమూరు మండల పరి షత్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం జరుగుతుందని మండల అభివృద్ధి అధికారి కె.అప్పలనాయుడు తెలిపారు బుధవారం సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులతో సమావేశం జరుగుతుందన్నారు. సమావేశా నికి అందరూ హాజరవ్వాలని కోరారు.

## రోణంకిని సన్మానించిన న్యాయవాదులు

**జలుమూరు, నవంబర్ 11(వార్త):** రాష్ట్ర కళింగ కార్పొరేషన్ సంస్థ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడుని సోమవారం ఉదయం నరసన్నపేట కోర్టు ఆవరణలో న్యాయవాదుల సమావేశ మందిరంలో భారీగా సన్మానించారు. కృష్ణమనాయుడుని పలువురు అభినందించారు. టీడీపీని నమ్ముకున్నందున మంచి అవకాశం లభించిందన్నారు.



# బడ్జెట్‌లో అన్ని రంగాలకు పెద్దపీట

**-జనసేన నాయకులు**

**కోత పూర్ణచంద్రరావు**



**కాశీబుగ్గ, నవంబర్ 11(వార్త):** ప్రభుత్వం బడ్జెట్‌లో అన్ని రంగాలకు పెద్దపీట వేసిందని పలాస నియోజకవర్గ జనసేన నాయకులు, మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు అన్నారు. సోమవారం అయన మీడియాతో మాట్లాడారు. అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పించిందన్నారు. కార్మిక, కర్షకుల పక్షపాతిగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం, వారికి గొప్ప భరోసాగా నిలవటం ఖాయమన్నారు.

అన్ని శాఖ లను అభివృద్ధి పథంలో నడిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆలోచన సరళితో గొప్ప బడ్జెట్ ను ప్రవేశపెట్టినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. అందరికీ ఆమోద్యదాయకమైన బడ్జెట్‌ను ప్రవేశ పెట్టి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆశయ సాధనలో రాష్ట్ర ప్రజలకు మంచి జరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్‌కి ధన్యవాదాలు తెలిపారు.

# లక్షలు ఖర్చు చేశారు..లక్ష్యం మరిచారు..!

**-రహదారులపై కానరాని మొక్కలు**



**జలుమూరు, నవంబర్ 10(వార్త):** అనేక ప్రాంతాల్లో రహదారులకు ఇరువైపులా పచ్చని మొక్కలు నాటాలని మూడు దశాబ్దాలుగా ప్రభుత్వం అనేక కోట్లు ఖర్చు చేసింది. కానీ ఏ రహదారి పక్కన చూసినా పట్టుమని పది మొక్కలు కనిపించవు 1990లో నాటి ప్రభుత్వం చల్లవానిపేట నుంచి శ్రీముఖలింగం వరకు 17 కిలోమీటర్లు రహదారి ఇరువైపులా అనేక మొక్కలు నాటారు. వాటిని పెంచేందుకు లక్షల ఖర్చు చేశారు. పచ్చదనం-పరిశుభ్రత తరువాత.. పచ్చని చెట్టు ప్రగతికి మెట్టు, సామాజిక అటవీ శాఖ ఆధ్వర్యంలో మరికొన్ని, ఉపాధి హామీ పథకం కింద మరికొన్ని ఇలా వివిధ శాఖల ద్వారా అనేక దఫాలుగా మొక్కల కోసం లక్షల ఖర్చు చేసిన సంగతి అందరికీ తెలిసిందే.

ముప్పై సంవత్సరాలుగా చల్లవానిపేట జంక్షన్ నుంచి సారవకోట, చల్లవానిపేట జంక్షన్ నుంచి, శ్రీముఖలింగం-నరసన్నపేట వెళ్లే రహదారిలో ఎక్కడ మొక్కలు కనిపించవు.

ఇదిలా ఉండగా కొద్దిరోజుల క్రితం చల్లవాని పేట నుంచి సారవకోట వెళ్లే రహ దారికి అడ్డ పనస వెంకటాపురం ప్రాంతాల్లో మొక్కలు నాటుతూ వాటికి రక్షణ కడుతున్నారు. అనేకసార్లు రక్షణ కోసం లక్షల ఖర్చు చేసిన సంగతి అధికారులకు..ప్రజలకు తెలిసిన సంగతి. ఏది ఏమైనా మొక్కల కోసం లక్షల ఖర్చు చేసి లక్ష్యాన్ని దెబ్బతీస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

# సేంద్రియ పంటలే ఆరోగ్యం

**వంగర, నవంబర్ 11(వార్త):** సేంద్రీయ పంటలే ఆరోగ్యకరమని మరువాడ ప్రకృతి వ్యవసాయయూనిట్ ఇన్‌చార్జి ఆర్నెపల్లి సింహాద్రి నాయుడు తెలిపారు. సోమవారం వంగర ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల్లో కూరగాయలను విక్రయించారు. అనంతరం ఆయన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వినియోగంతో ఉపయోగాలను వివరించారు. సంప్రదాయ, సేంద్రియ ఆహారాల మధ్య ఎంపిక చాలా ముఖ్యమైనదిగా మారిందన్నారు. ఇది ప్రయోజనాల శ్రేణిని అందిస్తుందన్నారు. సేంద్రియ వ్యవసాయం కంపోస్టింగ్, పంట మార్పిడి వంటి పద్ధతుల ద్వారా నేల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తుందన్నారు. సేంద్రియ పండ్లు, కూరగాయలు, ధాన్యాల్లో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు వంటి అవసరమైన పోషకాలు సమృద్ధిగా ఉంటాయన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, శరీరంలో రోగ నిరోధక శక్తిని బలోపేతం చేయడానికి ఈ పోషకాలు చాలా ముఖ్యమైనవన్నారు.

కార్యక్రమంలో మండల మహిళ ఏపీఎం టి.మంగమ్మ, సీఆర్పీ పోలినాయుడు పాల్గొన్నారు.

# రింగురోడ్డు ఏర్పాటయ్యేనా?



**జలుమూరు, నవంబర్ 10(వార్త):** నరసన్నపేట - మండలం జమ్మూ జంక్షన్ నుంచి పాతపట్నం వరకు నాలుగు సంవత్సరాలుగా ఎన్‌హెచ్5 రోడ్డు నిర్మాణాలు జరుగుతున్నాయి. చాలా ప్రాంతాల్లో ఫ్లై ఓవర్ వంతెనలు అండర్ ప్రాసెస్ రోడ్లు ఏర్పాటు జరిగాయి. అన్ని గ్రామాల రహదారులు వెడల్పు చేశారు.

రహదారికి అవసర మగు స్థలాన్ని సేకరించి రోడ్డు నిర్మా ణాలు పూర్తి చేశారు. పాతపట్నం తిలారు రైల్వే గేట్ ప్రాంతాల్లో ఫ్లైఓవర్ వంతెన నిర్మాణ పనులు పూర్తవ్వాల్సి ఉంది. ఈ రహదారి నిర్మాణంలో భాగంగా నాలుగు మండలాల కూడలి ప్రదేశం అయిన చల్లవానిపేట జంక్షన్లో రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని సర్వే చేసి, విస్మరించారు.

రహదారులు కూడా అనుకున్నంత స్థాయిలో వెడల్పు కాకపోవడంతో నిరంతరం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని పలు వురు విమర్శిస్తున్నారు. అసలు ఇక్కడ రింగ్ రోడ్డు ఏర్పాటయ్యేనా లేదా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. పాలకులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## జాతీయ రహదారిపై కారు బోల్తా

**ఇచ్ఛాపురం, నవంబర్ 11(వార్త):** లొద్దపుట్టి జాతీయ రహదారిపై సోమవారం కారు బోల్తా పడింది. బరంపురంనకు చెందిన శ్రీనివాసరావు, భార్యతో కలిసి టెక్కలి మండలం రావివలస మల్లికార్జునస్వామి గుడికి వెళ్తుండగా ద్విచక్రవాహనం అడ్డుగా రావడంతో దాన్ని తప్పించే ప్రయత్నంలో కారు అదుపుతప్పి పల్టీలు కొట్టింది. అది చూసిన వెంటనే లొద్దపుట్టి గ్రామస్తులు వచ్చి కారులో ఉన్న ఇరువురిని బయటికి తీశారు. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. కారు పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది.



# హరోం..హర..!

- శివాలయాలకు పోటెత్తిన భక్తులు
- తెల్లవారుజాము నుంచే బారులు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు



**జలుమూరు, నవంబర్ 11(వార్త):** కార్తీక మాస 2వ సోమవారం సందర్భంగా శ్రీముఖలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తెల్లవారుజాము నుంచే పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఒడిశా నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ఆలయ అభివృద్ధి కమిటీ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు. శివునికి ఎంతో ఇష్టమైన కార్తీక మాసంలో నేడు శివుని దర్శించుకుంటే పాపాలు నశిస్తాయని భక్తుల నమ్మకం. భక్తులకు ఎండ నుంచి రక్షణకు టెంట్లు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే గ్రామంలో ఉన్న చెత్తతో భక్తులు ఇబ్బందికి గురయ్యారు.

**మందస, నవంబరు 11(వార్త):** మందస మండలం హరిపురం గ్రామంలో శ్రీఉమా సోమేశ్వరాలయం ప్రాంగణంలో కార్తీక సోమవారం సందర్భంగా సహస్ర దీపారాధన జరిగింది. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలను వెలి గించారు. గుడి ఆలయ పూజారి సంతోష్ కుమార్ పాండా సహస్ర దీపారాధన ప్రాధాన్యత గురించి భక్తులకు వివరించారు.





**వంగర, నవంబర్ 11(వార్త):** పవిత్ర పుణ్యక్షేత్రం సంగాం శ్రీ సంగమేశ్వర స్వామి ఆలయంలో కార్తీక రెండో సోమవారం నాడు భక్తులు తాకిడి ఎక్కువగా పెరిగింది. పెద్ద ఎత్తున వచ్చి స్వామిని దర్శించుకున్నారు. వేకువ జాము నుంచే నాగావళి, సువర్ణముఖి, వేగావతి నదులు కలిసే త్రివేణి సంగమం వద్ద వేలాది మంది భక్తులు స్నానాలాచరించి శివుని వద్ద దీపాలు వెలిగించి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. స్వామి వారి దేవాలయంలో స్వామిని దర్శించుకుని దీపాలు వెలిగించడం ఎంతో పుణ్యప్రదమని భక్తుల నమ్మకం. ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలవగకుండా ఆలయ చైర్మన్ బోను ఆనందరావు, ఈవో శ్యామలరావు, ఆలయ ప్రధాన అర్చకులు సిద్ధాంతం గణపతి, అర్చకులు అన్ని ఏర్పాట్లు చేశారు. వంగర, ఎం.సీతారాం పురం, తలగాం, రాజుల గుమ్మడ, వీవీఆర్ పేట, కొప్పరవలస, కొత్తవలస, గీతనాపల్లి, నీలయ్యవలస, అరసాడ తదితర శివాలయాల్లో భక్తులు దర్శించుకున్నారు. దీంతో ఆలయాల్లో కార్తీక మాస శోభ సంతరించుకుంది. ఆలయాల్లో ప్రత్యేక పూజలు కూడా నిర్వహిస్తున్నారు.



## ఒడిశా నుంచి పూణేకు గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

**ఇచ్ఛాపురం, నవంబర్ 11(వార్త):** ఒడిశా నుంచి పుణేకు గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ మీసాల చిన్నంనాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజస్థాన్‌కి చెందిన నరేష్ మెహతా, ఛత్తీస్‌గఢ్‌కి చెందిన మున్నీ ఖేలో (అనిత) కూడా మహారాష్ట్రలో నివాసం ఉంటున్నారు. వీరిద్దరూ ఒడిశా కందమాల్ నుంచి 16.650 కిలోల గంజాయిని ఇచ్ఛాపురం వరకు బస్‌లో వచ్చి అక్కడ నుంచి పుణేకు రైలులో తరలించేందుకు సిద్ధమవుతుండగా రూరల్ ఎస్ఐ ఇమంది శ్రీనివాస్‌రావు, సిబ్బంది వారిని అరెస్టు చేసి, సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.







## తుఫాన్ హెచ్చరికతో రైతుల్లో అలజడి

**జలుమూరు, నవంబర్ 11(వార్త):** రాష్ట్రంలో తుఫాన్ ప్రభావం ఉంటుందని వాతావరణ కేంద్రం హెచ్చరించడంతో రైతుల్లో అలజడి ఆందోళన మొదలైంది. సోమవారం ఉదయం నుంచి పంట పొలాల వైపు పరుగులు తీశారు. పొలాల్లో ఉన్న కోసిన చాలను తీసి కుప్పలుగా పెట్టుకుంటూ రక్షణ కల్పించుకుంటున్నారు. ఏది ఏమైనా వర్షాభాగం ఎక్కువైతే నష్టం తప్పదని రైతుల ఆందోళన చేస్తున్నారు.

## హైందవ శంఖారావం విజయవంతం చేయాలి

**ఇచ్ఛాపురం, నవంబర్ 11(వార్త):** విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని వక్తలు కోరారు. ఈ సభ ముందస్తు సన్నాహక సమావేశం ఈదుపురంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న దేవాలయాలను ఆదుకోవాలని, హిందూ దేవాలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించాలని డిమాండ్ చేశారు.సమావేశంలో సింహాద్రి ఫల్గుణరావు, కర్రి లింగరాజు, దాసప్ప, పాక తులసీదాస్, బల్లెడ కృష్ణారావు, బీజేపీ నాయకులు రామ్‌ప్రసాద్ మాస్టర్ వివిధ గ్రామాల పెద్దలు, సభ్యులు, అనేక హిందూ సంఘాలు, హైందవ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## వీఆర్‌ఏల సమస్యలపై 18న చలో విజయవాడ



**వంగర, నవంబర్ 11(వార్త):** వీఆర్‌ఏల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 18న చలో విజయవాడ కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని వీఆర్‌ఏల సంఘ రాజాం నియోజక వర్గ అధ్యక్షుడు వై.అప్పలస్వామి పిలుపు నిచ్చారు. సోమవారం ఆయన వంగర తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మండల వీఆర్‌ఏలతో సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశంలో అప్పల స్వామి మాట్లాడుతూ కార్యక్రమానికి వీఆర్‌ఏలందరూ విజయవాడ తరలి రావాలని కోరారు. అనంతరం వీఆర్‌ఏలు తహసీల్దార్ డి.ధర్మరాజుకు వినతిపత్రం సమర్పించారు.

Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## హరిశ్చంద్రపురం రైల్ నిలయంలో సమస్యలు పరిష్కరించండి



**టెక్కలి/కోటబొమ్మాళి, నవంబర్11(వార్త):** కోటబొమ్మాళిలోని ఎన్టీఆర్ భవనంలో కార్యకర్తల నుంచి సమస్యలను కేంద్ర విమానయన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు స్వీకరించారు. హరిశ్చంద్ర పురం రైలు నిలయం అభివృద్ధి చేయాలని మాజీ సర్పంచ్ పూజారి శైలజ సత్య న్నారాయణ ఆధ్వర్యంలో కార్యకర్తలు అభిమానులు వినతి పత్రాలు అందజేశారు. ఈ రైల్ నిలయంలో ఎక్స్‌ప్రెస్‌లు ఆపాలని, బుకింగ్ కౌంటర్, గొడౌన్లు నిర్మాణం చేపట్టాలని కోరారు. నియోజకవర్గంలో అన్ని రకాల సమస్యలపై మండలాల వారీగా ఆయా నాయకులు పలు వినతులు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, టీడీపీ నాయకులు బోయిన గోవిందరాజులు, బోయిన రమేష్, వెలమల విజయలక్ష్మి, తర్ర రామక్రిష్ణ, కర్రి అప్పారావు, నంబాళ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పటిష్టంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం

* జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు
* సీఐడీ ఆధ్వర్యంలో శివాని కళాశాలలో వర్క్ షాప్




**ఎచ్చెర్ల, నవంబర్11(వార్త):** ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాలు, దాడులు నిరోధించటానికి, బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు భారత ప్రభుత్వం ఎస్సి, ఎస్టి అత్యాచార నిరోధక చట్టం పటిష్టంగా అమలు చేస్తున్నదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు అన్నారు. బాధితులకు తగిన రక్షణ, పునరావాసం, వివక్షత, వేధింపులనుంచి రక్షణ కల్పించడం దీని లక్ష్యమని, ఈ చట్టంపై సంపూర్ణ అవగాహన చేసుకొని, దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ నేర పరిశోధనా విభాగం (ఏపి, సిఐడి), విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో చిలకపాలెంలోని శివాని ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్సి ఎస్టి అత్యాచార నిరోధక చట్టం-1989పై సోమవారం ఒక్క రోజు వర్క్ షాపు నిర్వహించారు. సీఐడీ అదనపు ఎస్పీ ప్రేమ కాజల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సన్యాసి నాయుడు మాట్లాడుతూ సుమారు 35 ఏళ్ల క్రితం ఈ చట్టం అమల్లోకి వచ్చినప్పటికీ, దీనిపై ఇప్పటికీ చాలా మందికి సంపూర్ణ అవగాహన లేదని చెప్పారు. ఎస్సి, ఎస్టిల సంరక్షణ కోసం చేసిన ఈ చట్టం వల్ల ఎంతో మందికి ప్రయోజనం చేకూరిందని, వారి హక్కులు పరిరక్షణ జరిగిందన్నారు చెప్పారు. కొన్ని ఇతర చట్టాల మాదిరిగానే అప్పడప్పుడూ ఈ చట్టాన్ని కూడా దుర్వినియోగం చేస్తున్న సంఘటనలు కూడా ఉన్నాయన్నారు. ఇప్పటికీ పలు చోట్ల అసమానతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కేసుల్లో కోర్టు ఫీజు పూర్తిగా మినహాయింపు ఉంటుందని చెప్పారు. టెక్కలి, కొత్తూరు, పలాస జూనియర్ సివిల్ జడ్జిలు చక్రవర్తి, వాణి, వి.మాధురిలు ఎస్సి, ఎస్టిల రక్షణ కోసం రూపొందించిన ఈ చట్టంపై ఉన్న అపోహలను తొలగించి, పలు ఉదాహరణలు వివరించారు. పలు సెక్షన్లు, చాప్టర్లుపై విశదీకరించారు. నేటి విద్యార్థులంతా కుల వివక్షత, అంటరానితనం తదితర సామాజిక దురాగతాలను రూపుమాపేందుకు తమ వంతు కృషి చేయాలన్నారు. ఏఎస్పీ జి.ప్రేమ్ కాజల్ మాట్లాడుతూ, వర్క్ షాప్ నిర్వహణ వెనుక ముఖ్య ఉద్దేశ్యాన్ని వివరించారు. ఎస్సి, ఎస్టి అట్రాసిటీ చట్టంపై ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించే ఉద్దేశంతో రాష్ట్రంలో వివిధ చోట్ల ఏపి,సిఐడి ఆధ్వర్యంలో సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కులం ఆధారంగా ఎవరినీ చిన్నచూపు చూడకూడదని, వేధింపులకు గురి చేయకూడదన్నదే ఈ చట్టం ముఖ్య ఉద్దేశమన్నారు. కుల వివక్షత అన్నది హీనమైన నేరమని, వివక్షతను చూపిస్తే ఈ చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సదస్సులో ముందుగా బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రాజు, సిఐడి నుంచి డీఎస్పీ ఎంఎన్ భూపాల్, సీఐలు బివిడి ప్రసాద్, వై.రవి, అవతారం, ఎస్ఐ స్వర్ణలత, సాంఘిక సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ కృష్ణవేణి, జిల్లా విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు కంత వేణు, అంబేద్కర్ ఇండియా మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్హులకు న్యాయం చేయండి

* వైసీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జీ పేరాడ తిలక్
* టెక్కలి ఆర్డీవోకు పలు సమస్యలపై వినతిపత్రం



**టెక్కలి, నవంబర్ 11(వార్త):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలలలో టెక్కలి నియోజకవర్గంలోని నిరుపేదలు, అర్హులైన లబ్ధిదారులు, వైసీపీ సానుభూతిపరులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని వీరికి న్యాయం చేయాలని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తిని వైసీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ కోరారు. సోమవారం టెక్కలి రెవెన్యూ డివిజనల్ అధికారిని కలిసి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియోజకవర్గంలో వైసీపీ సానుభూతిపరులపైన, నిరుపేదలు, అర్హులైన లబ్ధిదారుల పైన జరుగుతున్న దాడులు, 400 మంది చిరుద్యోగులు తొలగింపు, హుదూద్ ఇళ్ల రద్దు, జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాల రద్దు, వ్యక్తిగత దాడులు, సంక్షేమ పథకాలు నిలుపుదల చేస్తూ గ్రామాల్లో ప్రజలను కూటమి నాయకులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపి పేదలకు న్యాయం చేయాలని తిలక్ కోరారు. పలు సమస్యలపై ప్రస్తావిస్తూ న్యాయం జరగకుంటే తాము న్యాయస్థానాలను ఆశ్రయించాల్సి వస్తుందని ఆర్డీవోకు తిలక్ తెలిపారు. సమస్యలపై దర్యాప్తు చేసి పేదలకు న్యాయం జరిగేలా చూస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు. అనంతరం తిలక్ విలేకరులతో మాట్లాడుతూ ఐదు నెలల కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు అధికారులు నిరుపేదలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. దీనికి అచ్చెన్నాయుడే బాధ్యత వహించాల్సివుంటుందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి దురాగతాలకు పాల్పడితే తీవ్రంగా ఎదుర్కొని ప్రజల పక్షాన నిలబడి న్యాయం చేస్తామని తిలక్ అన్నారు. ఈ కార్యక్రమంలో టెక్కలి మండల ఎంపీపీ ప్రతినిధి అట్ల రాహుల్, కోటబొమ్మాళి ఎంపీపీ ప్రతినిధి రోణంకి మల్లయ్య, నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సత్తారు సత్యం, సంపతరావు హేమసుందర్ రాజు, బుడ్డ మోహన్ రెడ్డి, నందిగాం మండల పార్టీ అధ్యక్షుడు తమరి ఫాల్గుణరావు, జేసిఎస్ కన్వీనర్ జద్యాడ జయరాం, సర్పంచ్‌లు మార్పు నాగభూషణం, కాళ్ల సంజీవ్, బొమ్మాళి గున్నయ్య, పోలాకి మోహన్‌రావు, జీరు బాబూరావు, నందిగాం మండల ప్రత్యేక ఆహ్వానితుడు చిన్ని జోగారావుయాదవ్, బెండి ఉదయ్, ధర్మారావు, పంగ రామయ్య, నాలుగు మండలాల కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్‌కు 53 వినతులు

**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 11(వార్త):** ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రస్సెల్ సిస్టం, పి జి ఆర్ ఎస్) కు 53 వినతులు వచ్చాయి. జిల్లా కలెక్టర్, అర్జీదారుల నుండి వినతులను స్వయంగా స్వీకరించారు. రీఓపెన్ గ్రీవెన్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి చట్ట పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులు ఆదేశించారు. వినతులు సకాలంలో పరిష్కరించవలనని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను రిజిస్టర్ నందు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. దరఖాస్తుదారుడు కోరిన సమస్యకు అనుగుణంగా ఎండార్స్మెంట్ స్పీకింగ్ ఆర్డర్ కచ్చితంగా దరఖాస్తుదారులకు అందజేయాలని స్పష్టం చేశారు.


## ప్రజా ఫిర్యాదులు చట్ట పరిధిలో పరిష్కారం చూపాలి:ఏఎస్పీ

ప్రజా పిర్యాదులు చట్ట పరిధిలో పరిష్కారం చూపాలి అని అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదులు స్వీకరణ, పరిష్కార కార్యక్రమంలో 49 ఫిర్యాదులు అందాయి. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోను ప్రజల నుంచి 49 ఫిర్యాదులు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఫిర్యాదు దారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ కాల్స్ ద్వారా తక్షణమే తెలియ పరిచి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పట్ల అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

**ఇచ్ఛాపురం, నవంబర్ 11 (వార్త):** బెల్లుపడ స్కై డ్రాప్ కూడలి వద్ద సోమవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టడంతో తిప్పనపుట్టుగ గ్రామానికి చెందిన తిప్పన పృథ్వి(22) అనే యువకుడు మృతి చెందాడు. పృథ్వి విజయవాడలో పనిచేస్తూ ఆదివారం స్వగ్రామానికి వచ్చాడు. తండ్రి నారాయణ గతంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసి ఆరోగ్యం బాగు లేక ఇంటి దగ్గర ఉంటున్నారు. తల్లి అన్నపూర్ణ ఉన్నారు. కుటుంబాన్ని పోషించే కుమారుడు మృతి చెందడంతో కుటుంబీకులు బోరున విలపిస్తున్నారు.

## వైభవంగా అయ్యప్ప పడిపూజ



**మెళియాపుట్టి, నవంబర్ 11(వార్త):** పట్టుపురం గ్రామంలో గురుస్వామి తామాడ భాస్కరరావు ఇంటి వద్ద తమ్మినేని నాగేశ్వరరావు గురుస్వామి ఆధ్వర్యంలో 400 మందికి పైగా అయ్యప్ప దీక్షాధారులతో సోమవారం పడి పూజ నిర్వహించారు. పూజల్లో 29 సన్నిధానాలకు సంబంధించిన గురుస్వాములు, డాక్టర్ శరత్ కుమార్ స్వామి, వివిధ గ్రామాల నుండి వచ్చిన అయ్యప్ప స్వాములు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

## క్యాన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తోనే సాధ్యం

**శ్రీకాకుళం, నవంబర్ 11(వార్త):** జిల్లాలో సార్వత్రిక క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ రూపొందించిన క్యాన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తోనే సాధ్యం అనే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటికి వైద్య సిబ్బంది వెళ్లి స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారని, తీవ్రమైన కేసులను పీహెచ్‌సీలకు తరలిస్తారన్నారు. అవసరం మేరకు వైద్య కళాశాలలకు సిఫారసు చేస్తారని తెలిపారు. జిల్లాలో 18 సంవత్సరాలు పైబడిన వారు సుమారు 17 లక్షల మందికి పైగా ఉండవచ్చునని అంచనా వేస్తున్నామని, వారందరికీ స్క్రీనింగ్ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ స్క్రీనింగ్‌లో ఏఎన్ఎంలు, సీహెచ్‌వోలు, వైద్యాధికారులు, గైనకాలజిస్టులు పాల్గొంటారని తెలిపారు. గోడపత్రికల ఆవిష్కరణ కార్యక్రమంలో డీఎంహెచ్వో బి.మీనాక్షి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీధర్ రాజా తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు



**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 11(వార్త):** శ్రీకాకుళం నగరంలోని 31వ డివిజన్ పరిధిలోని పలు వీధుల్లో టీడీపీ సభ్యత్వం నమోదు కార్యక్రమం డివిజన్ ఇన్చార్జి విభూతి సూరిబాబు ఆధ్వర్యంలో విస్తృతంగా సాగింది. సోమవారం చాకలి వీధిలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో విభూతి సూరిబాబు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల సంక్షేమమే టీడీపీ లక్ష్యమన్నారు. తమ డివిజన్‌లోని పలు వీధుల్లో జోరుగా సభ్యత్వం నమోదు కార్యక్రమం జరుగుతున్నదని చెప్పారు. గత కొన్ని రోజులుగా ఈ కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోందన్నారు. పార్టీ కార్యకర్తల కోసం టీడీపీ అధిష్టానం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని చెప్పారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చంద్రబాబుతోనే సాధ్యమని, రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామ్ బాబు, సుభాష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి బీజం వేసిన స్ఫూర్తిదాత మౌలానా



**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 11(వార్త):** భారతదేశ స్వాతంత్ర సమరంలో కీలకపాత్ర పోషించడంతో పాటు దేశ విద్యాభివృద్ధికి పటిష్టమైన బీజం వేసిన స్ఫూర్తిదాత భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని వక్తలు పేర్కొన్నారు. స్వాతంత్ర్యం అనంతరం దేశంలో యూజీసీతో పాటు ఐఐటీ ఏర్పాటుకు కృషి చేసిన మహనీయుడు అని కొనియాడారు. శ్రీకాకుళం పట్టణంలోని గాంధీ మందిరం స్వాతంత్ర సమరయోధుల స్మృతి వనంలో భారతరత్న అబుల్ కలాం ఆజాద్ 136వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విగ్రహ దాతలు మహిబుల్లాఖాన్‌తో పాటు వక్తలు సురంగి మోహనరావు, మేడూరి ప్రసాదరావు, పొన్నాడ రవికుమార్, కొంక్యాన వేణుగోపాల్ తదితర బృందం మౌలానా విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో వివిధ రంగాల ప్రముఖులు నిక్కు అప్పన్న, పందిరి అప్పారావు, కొమ్ము రమణమూర్తి, నక్క శంకరరావు, శాసపు జోగినాయుడు, పెంకి చైతన్యకుమార్, షాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆజాద్‌కు నివాళి

స్వాతంత్ర సమరయోధుడు, భారతదేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ దేశ విద్యా రంగానికి అందించిన సేవలు ఎంతో విలువైనవని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి సందర్భంగా జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జాతీయ విద్యా దినోత్సవం, అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మైనారిటీ సంఘాల ప్రతినిధులు భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిఆర్ఓ వెంకటేశ్వర్రావు, కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి సూర్యనారాయణ, వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ అబ్దుల్ సాదిక్ షేక్, ముస్లిం నాయకులు షేక్ నిజాముద్దీన్, బహదూర్ బాషా, సయ్యద్ సిలార్, షేక్ మొహమ్మద్ గౌస్, ఎండి రఫీ, షేక్ మదీనా, షేక్ మస్తాన్, సయ్యద్ నాగు, షేక్ అబ్బు, అబ్దుల్ గఫార్ ఖాన్, మహమ్మద్ అబ్దుల్ రజాక్, జోసఫ్ డేనియల్ గోడి, డాక్టర్ జాన్ జీవన్, బిషప్ బర్నబాస్, ఆర్.అశోక్ కుమార్ పాల్గొన్నారు.

Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546